క్లుప్తంగా

ఘనంగా పొంగళ్లు



పొంగళ్ల ఊరేగింపులో గ్రామస్తులు

తడ: గ్రామశక్తి చెల్లాతమ్మ తడకండ్రిగవాసులు బుధవారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. తొలుత గ్రామంలో పోలేరమ్మకు అంబళ్లు పోసి, అనంతరం మేళ తాళాలతో అమ్మవారి నైవేద్య సామగ్రిని ఊరేగింపుగా తీసుకుని చెల్లాతమ్మ ఆలయం వద్దకు చేరుకుని, పొంగళ్లు పెట్టారు.

పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఏపీఓ గిరిబాబు

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుకు సంబంధించిన పనులు త్వరగా పూర్తి చేసి, రైతులకు నగదు చెల్లింపులు చేయించాలని ఏపీఓ గిరిబాబు సూచించారు. ఉపాధి కార్యాలయంలో బుధవారం ఆయన క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సన్న, చిన్నకారు రైతులు మెట్ట భూముల్లో ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఇందులోభాగంగా పలు గ్రామాల్లో రైతులు ముందుకు వచ్చారన్నారు. ఈ నేపథ్యంలో వారికి నిమ్మ, మామిడి, మల్లి సాగుకు అనుమతులు మంజూరయ్యాయన్నారు. ఆయా మొక్కలు నాటడం పూర్తి చేయించాలని తెలిపారు.

బడిలో చేర్పించండి



మాట్లాడుతున్న ఎంఈఓ శైలజ

ఓజిలి: బడిబయట ఉన్న పిల్లల(డ్రాపౌట్స్)ను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడానికి చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శైలజ అన్నారు. ఎమ్మార్సీలో బుధవారం వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లుతో ఈజీఎస్ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రాపౌట్స్‌ను గుర్తించి తప్పకుండా విద్యాబోధనలు అందేలా చూడాలని తెలిపారు. అలాగే ఓజిలి ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న కాంప్లెక్ సమావేశానికి ఎంఈఓ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి



మాట్లాడుతున్న సీఎంఓ రమేష్

డక్కిలి: ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తెలుగు పాఠ్యాంశాలను సులభపద్ధతిలో విద్యార్థులకు బోధించాలని తిరుపతి సర్వశిక్షా అభియాన్ కమ్యూనిటీ మొబైల్ ఆర్గనైజర్ రమేష్ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లె మండలాల్లోని జెడ్పీ హైస్కూళ్లలో తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు.

కంప్యూటర్లు, ప్రింటర్ల వితరణ



కంప్యూటర్, ప్రింటర్ ఇస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్లకు రెండు కంప్యూటర్లు, కలర్ ప్రింటర్లను బుధవారం మేనకూరు సెజ్‌లోని అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు వితరణ చేశారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులను ఎండీ నిత్యానందరెడ్డి, డైరెక్టర్ పీ శరత్‌చంద్రరెడ్డిలు మంజూరు చే యడంతో రెండు పోలీస్‌స్టేషన్లకు కంప్యూటర్‌ల ను ఏపీఎల్ హెల్త్ యూనిట్ ప్రతినిధులు సీఐలు నరసింహరావు, వైవీ సోమయ్యకు అందజేశారు.

ఇరిగేషన్ ఏఈకి ఉద్యోగోన్నతి

వాకాడు: మండల ఇరిగేషన్ ఏఈగా పనిచేస్తున్న జి సుబ్బారావుకు బుధవారం డీఈగా ఉద్యోగోన్నతి లభించింది. బుధవారం ఆ శాఖ అధికారులతోపాటు మండలంలోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సుబ్బారావును అభినందించారు. వాకాడు, చిట్టమూరు మండలాల సబ్ డివిజన్ డీఈగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సుబ్బారావు తెలిపారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

వెంకటగిరిరూరల్: జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి, సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎన్‌జేఆర్ భవనంలో బుధవారం హౌసింగ్, సచివాలయ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకాలనీ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి, సకాలంలో పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మూడో కన్ను మూసుకుంది!

నేర నియంత్రణ.. శాంతి భద్రతల పరిరక్షణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాయుడుపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థ మూలకు చేరింది. పలు కేసులు ఛేదించడానికి కీలకమైన మూడో కన్ను.. కొరవడిన పర్యవేక్షణ.. ఆర్థిక భారం.. పుటేజీల నిర్వహణ లేమితో మూసుకుపోయింది. ఫలితంగా నిఘా వ్యవస్థ మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది.

- అటకెక్కిన నిఘా వ్యవస్థ
- పనిచేయని సీసీ కెమెరాలు





పోలీస్‌స్టేషన్ నుంచి పట్టణంలో పరిస్థితులను తెలుసుకుంటున్న పోలీసు(ఫైల్), పట్టణంలో ఉన్న సీసీ కెమెరాలు

నాయుడుపేటటౌన్: పట్టణంలో గతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ కొంత కాలనీకే ఆటకెక్కింది. నాయుడుపేట పట్టణం తిరుపతి, నెల్లూరు, చైన్నై తదితర ప్రధాన ప్రాంతాలకు కూడలిగా ఉంది. అలాగే నాయుడుపేట కేంద్రంగా అక్రమ రవాణా, పట్టణానికి సమీపంలో జాతీయ రహదారి పరిధి ఉండడంతో రోడ్డు ప్రమాదాలు సైతం ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ క్రమంలో శాంతి భద్రతల పర్యవేక్షణకు ఉమ్మడి నెల్లూరు జిల్లాగా ఉన్న సమయంలో అప్పటి జిల్లా ఎస్పీ సారథ్యంలో నాయుడుపేట పోలీస్‌స్టేషన్ నుంచే వీక్షించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల యాజమాన్యాలు, పలువురు దాతల సహకారంతో పట్టణంలో ప్రధాన కూడళ్లతోపాటు నరసారెడ్డికండ్రిగ, మల్లాం జాతీయ రహదారి, గోమతి సెంటర్ తదితర రహదారుల వద్ద సుమారు 45 ప్రాంతాల పైగా సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ పరిధిలో ఏ మూల.. ఏం జరిగినా తెలిసిపోయేలా నిఘా వ్యవస్థ ఏర్పాటైంది. అప్పట్లో రూ.లక్షల వ్యయంతో నాయుడుపేటలో ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ కొంత కాలనీకే ఆటకెక్కింది. సీసీ కెమెరాల మానిటరింగ్ వ్యవస్థకు ఇంటర్ నెట్ కేబుళ్ల నిర్వహణ ఆర్థిక వ్యయం భారంగా మారడంతో కొద్ది నెలలుకే సీసీ కెమెరాల పుటేజీల మానిటరింగ్ నిలిచిపోయింది. సీసీ కెమెరాల ఏర్పాటులో చూపిన చొరవ, వాటి నిర్వహణపై పోలీసులు శ్రద్ధ చూపకపోవడంతో చాల వరకు కెమెరాలు మాయమయ్యాయి. అప్పట్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పలు చోరీ కేసులను సునాయసాంగా ఛేదించారు. అంతే కాకుండా పట్టణంలో ప్రధాన కూడళ్లలో ఏం జరిగేది.. ఇట్టే తెలిసిపోయేది. అయితే ప్రస్తుతం నాయుడుపేట పట్టణంలో కొన్ని చోట్ల తిరుపతి జిల్లా పోలీస్ వ్యవస్థ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ కెమెరాల పర్యవేక్షణ జిల్లాకేంద్రం నుంచే చూడాల్సి ఉంటుంది. నాయుడుపేటలో తిరిగి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగలిగితే నేర నియంత్రణకు దోహద పడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నిఘా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం



"నాయుడుపేటలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చాలా వ రకు పనికిరాకుండా పోయాయి. వీటి మరమ్మతుల కోసం గుంటూ రుకు పంపించాం. తిరిగి పట్టణంలో ప్రధాన కూడళ్లతోపాటు ముఖ్య ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. షాపింగ్ మాల్స్ యాజమానులు, అపార్టుమెంట్ వాసులు, బంగారు దు కాణాదారులు స్వచ్ఛందంగా జనాల రాకపోకలు క్లుప్తంగా కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి." - కే నరసింహరావు, సీఐ, నాయుడుపేట

డిసెంబర్‌లోపు ప్రజలకు అంకితమిస్తాం



ఫ్లై ఓవర్ బ్రిడ్జి పునఃనిర్మాణ పనులను బటన్ నొక్కి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఫ్లెటైవర్ నిర్మాణ పనులను డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేసి, ప్రజలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. గూడూరులోని సొసైటీకాలనీలో బుధవారం ఆయన అధికారులు, నాయకులతో కలిసి ఫ్లెటైవర్ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా సిమెంట్ బ్యారెక్స్ యూనిట్‌ను బటన్ నొక్కి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి భవనాల తొలగింపు, ఆక్రమణలను తొలగించారన్నారు. కేవలం ఓ భవంతి వారు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా కట్టడమే కాకుండా అడ్డుపడుతున్నారన్నారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఫ్లెటైవర్ నిర్మాణానికి అడ్డుపడవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గురవయ్య, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డి, నాయకులు అజీజ్‌ఖాన్, బట్టా గోపీయాదవ్, మహేంద్ర, రమేష్, జేసీఎస్ కన్వీనర్ శ్రీహరి, తూపిలి లక్ష్మి, అల్తాఫ్, శేషు, మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీజీఎంపీ పనులపై సమీక్ష...

గూడూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం పనులకు సంబంధించి అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ గూడూరు మున్సిపాలిటీలో 30 వార్డు సచివాలయాలకు సంబంధించి రూ.6 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలన చూసి ఓర్వలేక ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 విద్వేషం చిమ్ముతున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాసమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్తాఫ్, తూపిలి లక్ష్మి పాల్గొన్నారు.

కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ మురళి

నాయుడుపేటటౌన్: పొదుపు సంఘాల్లో లేని మహిళలను గుర్తించి, కొత్తగా సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం నియోజవర్గ ఏరియా కోఆర్డినేటర్ మురళి సూచించారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయం వద్ద బుధవారం పొదుపు మహిళ సమాఖ్య వార్షిక మండల మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు లావాదేవీలు సక్రమంగా జరుపుకోవాలన్నారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంత రం పొదుపు మహిళ సమాఖ్యకు నూతనంగా కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సమాఖ్య మండల అధ్యక్షురాలిగా మాధవి, కార్యదర్శి వెంకటరమణ మ్మ, ఉపాధ్యక్షురాలిగా ప్రసన్నకుమారి, సంయుక్త కార్యదర్శి రమాదేవి ఎన్నికయ్యారు. నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య



తడ: మండలంలోని కొండూరు పంచాయతీలో బుధవారం రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్ఐ జి.మాలకొండయ్య మాట్లాడుతూ మృతుడికి సుమారు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని, మృతదే హం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూ ళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 95732 45266 నంబర్‌కి తెలియజేయాలని కోరారు.

చెట్టును ఢీకొన్న కాలేజీ బస్సు



ఓజిలి: మండలంలోని రాచపాళెం జాతీయ రహదారి వద్ద బుధవారం నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ బస్సు చెట్టును ఢీకొంది. వివరాలు.. సూళ్లూరుపేట నుంచి 28 మంది విద్యార్థులతో గూడూరుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

సైదాపురం: మండలంలోని కోమటి గుంటరాజుపాళెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అందరు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అడ్వకేట్ రాజారామ్

వెంకటగిరిరూరల్: చిన్నారులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని మండల లీగల్ సర్వీస్ ప్యానల్ అడ్వకేట్ రాజారామ్ సూచించారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తి, తెలుగు సాంస్కృతి సంప్రదాయాలను అలవరుచుకోవాలన్నారు. మండల లీగల్ సర్వీస్ ప్యానల్ అడ్వకేట్ అనుపమ, స్వప్న, హెచ్ఎం స్వర్ణలక్ష్మి పాల్గొన్నారు.

ట్యాబ్‌లతో ప్రమాణాలు పెంపు



ట్యాబ్‌ను పరిశీలిస్తున్న సీఎంఓ సురేష్‌కుమార్

గూడూరురూరల్: బైజ్యూస్ ట్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపుకు కృషి చేస్తున్నట్లు సర్వశిక్ష అభియాన్ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి(సీఎంఓ) సురేష్‌కుమార్ అన్నారు. గూడూరులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అందజేసిన బైజ్యూస్ ట్యాబ్‌లను పరిశీలించారు. ట్యాబ్‌ల ద్వారా పాఠాలను నేర్చుకోవడంపై విద్యార్థులను ఆరా తీశారు. ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు నేర్చుకున్న పాఠాలను చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

బడిబయట పిల్లలను గుర్తించాలి

కోట: బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందని ఎంపీడీఓ భవానీ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వలంటీర్లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 5–18 ఏళ్లలోపు పిల్లలు చదువుకు దూరంగా ఉన్న వారిని గుర్తించి జీఈఆర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి అందుబాటులో ఉన్న పాఠశాలల్లో చేర్పించి విద్యను అందించాలన్నారు. వలంటీర్లు, టీచర్లు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఎంఈఓ మస్తానయ్య పాల్గొన్నారు.

మహిళలకు అగ్రస్థానం



రాఖీ వేడుకల్లో పాల్గొన్న నాయకులు, మహిళలు

నాయుడుపేటటౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో అగ్రస్థానం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థినులలతో కలసి రాఖీ పండుగ ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మెప్మా ఆర్పీలు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ప్రసన్నకుమారితోపాటు వచ్చిన పొదుపు మహిళలు, విద్యార్థినులు నాయకులకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రాఖీలు కట్టిన వారికి స్వీట్లు పంపిణీ చేసి, నగదు బహుమతులను అందించి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఓ కిషోర్ యాదవ్, టీఎంఆర్ గ్రూప్ సంస్థల డైరెక్టర్ టీ మోహన్‌రెడ్డి, నాయకులు బీ మల్లికార్జునరెడ్డి, కే చెంచయ్య, కే జయరామయ్య, డీ రవి, పీ రాజేష్, కే భాను, కన్మణి, బీ రమణయ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు గంగ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

కలువాయి: తెలుగుగంగలో అంతర్భాగంగా ఉన్న సోమశిల కండలేరు వరద ప్రవాహ కాలువ పనులను బాలాజీరావుపేట ఎస్సీకాలనీ వాసులు బుధవారం అడ్డుకున్నారు. కాలువ సామర్థ్యం రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం రూ. 928.5 కోట్లతో పనులకు 2021వ సంవత్సరంలో పరిపాలన ఆమోదం ఇచ్చింది. ఈ పనులను రూ.776.2 కోట్లు అగ్రిమెంట్ విలువతో కాంటాక్టును ఓకంపెనీకి అప్పగించింది. కొంత కాలంగా ఆగిపోయిన పనులను ఆ కంపెనీ ఇటీవల పునఃప్రారంభించింది. ఇందులో భాగంగా బాలాజీరావుపేట ఎస్సీకాలనీ సమీపంలో కాలువ పనులను బుధవారం ప్రారంభించగా కాలనీ వాసులు అడ్డుకున్నారు. గత ఏడాది ఇక్కడ బ్లాస్టింగ్ కారణంగా రాళ్లు ఎగిరి పడి తమ ఇళ్లు, పైకప్పులు దెబ్బతింటున్నాయని, పనులను అడ్డుకుని ఆందోళన చేశారు. దీంతో కాంట్రాక్టర్ అక్కడ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

సమస్యలు పరిష్కరించుకుందాం



మాట్లాడుతున్న శివరామ్ ప్రసాద్

నాయుడుపేటటౌన్: అందరం ఐకమత్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకుందామని ఆల్ ఇండియా చేనేత ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విన్నమాల శివరామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో ఆ సంఘం నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేనేతల అభ్యున్నతితోపాటు రాజకీయ, ఆర్థిక సామాజిక రంగాల్లో చేనేతలకు సముచితస్థానం కోసం దేశవ్యాప్తంగా ఉన్న 18 సంఘాలతో కలసి పని చేస్తామన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు సాయికుమార్, చంద్రశేఖర్, జిల్లా నాయకులు శ్రీరామ్‌ప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, భాస్కర్, సుబ్బరాయులు, రామకృష్ణాయ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

గిరీశ్వరుడి హుండీ ఆదాయం రూ.9.92 లక్షలు



ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో ఉన్న స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.9.92 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ గూడూరు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో స్వామివారి హుండీ లెక్కింపు చేపట్టారు. ఏప్రిల్ 2023 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు భక్తులు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. ఇందులో రూ.9.92 లక్షలు నగదు, 150 గ్రాముల బంగారం, 269 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఎస్ ప్రకాశంనాయుడు, ఈఓ శ్రీధర్ నాయుడు, ధర్మకర్తలి మండలి సభ్యులు జే కోటేశ్వరరావు, కే శ్రీనివాసులు, ఎం హరినాథ్, జీ పోలయ్య పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ



వెంకటగిరి రూరల్ : లబ్ధిదారుకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. పట్టణంలోని 22వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ ఉమామహేశ్వరి, మురళి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నేదురుమల్లి లబ్ధిదారులను పలుకరించగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అద్భుతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ పి ప్రసాద్‌రెడ్డి, యోగానంద, ఎల్ వాసు పాల్గొన్నారు.

మిగిలిన 15 వార్డుల్లో కూడా గడపకు గడపకు..

వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో 25 వార్డుల్లో నేటికి గడప గడపకు మన ప్రభుత్వం టెక్నికల్‌గా పూర్తయిందని, కానీ మిగిలిన 15 వార్డుల్లో కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో వెంకటగిరి మున్సిపాలిటీలో 15 వార్డుల్లో తూతూ మంత్రంగా గడప గడప కార్యక్రమం నిర్వహించారని, కానీ తాను వెంకటగిరి సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు మున్సిపాలిటీ పరిధిలో 10 వార్డుల్లో గడప గడపకు కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నానని చెప్పారు.

సంక్షేమంతో ఇంటింటా సంతోషం



సైదాపురం: బుక్‌లెట్‌లో వివరాలను తెలుపుతున్న నేదురుమల్లి

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమంతో ఇంటింటా ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సైదాపురం మండలంలోని మర్లపూడి గ్రామ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగు అడుగునా మహిళలు హారతులిస్తూ, స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీ ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, రాంగోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, ఎం.నారాయణరెడ్డి, పీ జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సీ వెంకురెడ్డి, పెంచలనరసయ్య, యు గంధర్, పీ శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.